క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



మంగపేట: మండల కేంద్రానికి చెందిన బక్కయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన ఆర్థికంగా ఆదుకోవాలని ఎమ్మెల్యే సీతక్కను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయనిధి ద్వారా రూ 24,000 మంజూరు చేయించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కిశోర్‌లు లబ్ధిదారుడికి శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారావు, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, నాయకులు మైబూబ్‌ఖాన్, ఉజ్వల్, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, మల్లయ్య, హుస్సేన్, యనాయ్య, భగవాన్‌రెడ్డి, సురేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు



వాజేడు: మండల కేంద్రంలోని సహకార సంఘంలో రైతులకు కావాల్సిన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సెక్రటరీ సోమ సత్యనారాయణ తెలిపారు. ఎంటీయూ (1061) రకం విత్తనాలు 267 బస్తాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. బస్తాకు రూ.1059 చెల్లించి కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు.

పరామర్శలు..

ములుగు రూరల్: మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ సోదరుడు లక్ష్మయ్య ఇటీవల మృతి చెందగా ఎమ్మెల్యే సీతక్క బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అశోక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు చంద్రమౌళి, భరత్, శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సత్తిరెడ్డి, కుమార్, జయపాల్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, షకీల్, రాఘవేందర్, అజ్జు, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(ఎం): మండల కేంద్రానికి చెందిన అల్లం సమ్మయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా ములుగు, భూపాలపల్లి జిల్లా సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం అందించారు.

విద్యార్థులకు షూ పంపిణీ

వెంకటాపురం(కె): మండలంలోని మంగవాయిగూడెంలో గల ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రామారావు విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. రామారావు తండ్రి పండా బజార్ జ్ఞాపకార్థం పాఠశాలలోని 44 మంది విద్యార్థులకు కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాసరావుతో కలసి అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పరమేశ్వరావు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

గురుకులంలో ట్రైబల్ ఫుడ్ వేడుకలు



ఏటూరునాగారం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ట్రైబల్ ఫుడ్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జొన్న రొట్టెలు, చురుము, గడ్క, జావా, పాలననం, బచ్చలకూర, ఖీర్, ఇప్పపూల కుడుములు, కడ్లై వంటి వంటలను తయారు చేసి విద్యార్థినులకు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వసుంధరదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు అభిషేకం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గ్రామ దేవతలైన బొడ్రాయి అమ్మవారికి తిరుగు వారం పండుగను అర్చకులు రాధాకృష్ణశర్మ శనివారం ఘనంగా నిర్వహించారు. బొడ్రాయి, భూలక్ష్మి, పోతరాజులకు పాలాభిషేకం, జలాభిషేకంతోతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన ‘గిరిజన’ వేడుకలు



ఏటూరునాగారం: సర్పంచ్ రామ్మూర్తిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు



వెంకటాపురం(కె): జెడ్పీటీసీ రమణను శాలువాతో సన్మానిస్తున్న గ్రామస్తులు, అధికారులు

ఏటూరునాగారం: గ్రామాల అభివృద్ధిలో ప్రజలు, యువకులు భాగస్వాములు కావాలని గిరిజన సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ ఈసం రామ్మూర్తి కోరారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లతో పాటు గిరిజన కుల పెద్దలు చౌలన నాయక్, యాలం రాంలాల్, సత్యమ్మ, కృష్ణమూర్తి, వార్డు సభ్యురాలు నాగమణి, అశోక్‌లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే పాలక వర్గానికి ప్రజలు, యువత సహకరించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం తండాలు, గూడెలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దిందని, సరిపడా నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అరుణ, వార్డు సభ్యులు రంజిత్, హన్మంత్, కనకతార, మానస, స్వప్న, కోఆప్షన్ సభ్యురాలు తిరుపతమ్మ, యాదగిరి, స్పెషల్ ఆఫీసర్, రాహుల్, ఇన్‌చార్జ్ ఎంపీఓ శ్రీకాంత్, బిల్‌కలెక్టర్ రవీందర్, వెంకన్న, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అదే విధంగా చిన్నబోయినపల్లి, శివాపురం, రొయ్యూర్, కొండాయి, చెల్పాక, శంకరాజుపల్లి, రామన్నగూడెం, రాంనగర్ గ్రామాల్లో వేడుకలు నిర్వహించి గిరిజన ప్రజాప్రతినిధులను ఆయా పంచాయతీ కార్యాలయాల్లో శాలువాలతో ఘనంగా సన్మానించారు.

వెంకటాపురం(కె): తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గిరిజన దినోత్సవ వేడుకలు శనివారం మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఆదివాసీ ప్రజాప్రతినిధులను, కుల పెద్దలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. వెంకటాపురం మేజర్ పంచాయతీలో జెడ్పీటీసీ పాయం రమణ, సర్పంచ్ చిడెం యామిలి, ఆలుబాక పంచాయతీలో సర్పంచ్ పూజారి ఆదిలక్ష్మి, కుల పెద్దలను, గ్రామ దేవతల పూజారులను సన్మానించారు. అనంతరం ఆలుబాక పంచాయతీలో ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యకరమంలో ఎంపీడీఓ అడ్డూరి బాబు, తహసీల్దార్ నాగరాజు పాల్గొన్నారు.

వాజేడు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో గిరిజన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్‌లను ప్రజలు, అధికారులు శాలువాలతో సన్మానించారు. నాగారం సర్పంచ్ ఆదినారాయణను తహసీల్దార్ సయ్యద్ సర్వర్, ఎంపీడీఓ విజయ శాలువాతో సత్కరించారు. ప్రగళ్లపల్లిలో సర్పంచ్ నరేష్, ఏడ్జర్లపల్లిలో మల్లీశ్వరి, గుమ్మడిదొడ్డిలో జయలక్ష్మి, పెద్దగొళ్లగూడెంలో మేనక, భువనపల్లిలో బెనిని, పేరూరులో సరస్వతి, చింతూరులో బుల్లేశ్వరావులను అధికారులు, స్థానిక ప్రజలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

ములుగు రూరల్: అభివృద్ధికి దూరంలో ఉన్న గూడెలను, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని పంచోత్కులపల్లి సర్పంచ్ మాలోత్ రవీందర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రత్యేకాధికారి కసన్‌సింగ్ ఆధ్వర్యంలో గిరిజన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గిరిజనులను, తండాలను అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. గిరిజనులకు 6 శాతం నుంచి 10 శాతం రిజర్వేషన్‌ను పెంచిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించేందుకే దశాబ్ది ఉత్సవాలు చేపట్టినట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో గిరిజనుల ఎదుగుదలకు అనేక పథకాలు రూపొందిస్తారని ఆశాభావ వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గిరిజన ప్రగతి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాసిపెద్ది పుష్పలత, పంచాయతీ కార్యదర్శి స్వర్ణ, ఉప సర్పంచ్ సుమతి, వార్డుసభ్యులు సంతోశ్, విజయ, ఉపాధ్యాయులు తిరుపతయ్య, రవి, గ్రామ పెద్దలు సాంబయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: క్రీడలతో మానసికొల్లాసం అభిస్తుందని ఏటూరునాగారం సీఐ రాజు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శారీరక ధృడత్వానికి, మానసిక ప్రశాంతకు క్రీడలు దోహదపడుతాయని అన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. రెండు రోజుల పాటు జరిగే క్రీడల్లో గెలుపొందిన క్రీడాకాలరకు ప్రథమ, ద్వితియ బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. వైస్ఎంపీపీ భాస్కర్, తుపాకులగూడెం సర్పంచ్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ క్రీడలను సీఐ శివప్రసాద్ శనివారం ప్రారంభించారు. విద్యార్థులు, యువకులు క్రీడల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని అన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులకు బహుమతులు అందించినట్లు తెలిపారు.



వాజేడులో..



ములుగు రూరర్: పంచోత్కులపల్లిలో..



కన్నాయిగూడెంలో..

సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బుర్రి సతీశ్ మాదిగ

ములుగు: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏటూరునాగారం మండల కేంద్రంలో గల బీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 24వ తేదీన నిర్వహించ తలపెట్టిన ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర అధికార ప్రతినిధి బర్రి సతీశ్ మాదిగ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సుదీర్ఘ కాలంగా ఉద్యమం చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ హామీని నెరవేర్చాలన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కార్‌కు వినిపించేలా నియోజకవర్గ సభనిర్వహిస్తున్నామని, ఈ సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలోని మాదిగలు, ఉపకులాలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ శ్యాంబాబు, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ ఇరుగుపైడి, రవి, ఎంఎస్‌పీ జిల్లా నాయకులు దాసు, సాంబయ్య, మొగిలి, శంకర్, దుర్గారావు, సమ్మయ్య పాల్గొన్నారు.

టిప్పర్ పట్టివేత



ఏటూరునాగారం: మండలంలోని కొండాయి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీని శనివారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఎలాంటి వే బిల్లులు, అనుమతి లేని ప్రాంతం నుంచి ఇసుకను టిప్పర్‌లో లోడ్ చేసుకొని వెళ్తుండగా షాపెల్లి గ్రామ సమీపంలో పట్టుకున్నట్లు ఎఫ్ఆర్ఓ నరేందర్ తెలిపారు. టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని, వాహనం యజమాని, డ్రైవర్ వివరాలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలింపులు చేపడితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టుకున్న టిప్పర్ లారీని అటవీశాఖ రేంజ్ కార్యాలయానికి తరలించామని ఆయన వెల్లడించారు.

అసాంఘిక శక్తులకు సహకరించొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

వెంకటాపురం(కె): చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అసాంఘిక శక్తులకు ఎవరూ సహకరించొద్దని ఎస్సై కొప్పుల తిరుపతిరావు అన్నారు. సీతారాంపురం గ్రామంలో శనివారం కమ్యూనిటీ కాంటాక్టు పోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో ఏమైన సమస్యలు ఉంటే తెలుపాలని పోలీస్‌శాఖ తరుపున సంబంధిత శాఖ అధికారులకు తెలిపి పరిష్కరింపజేస్తామని అన్నారు. గ్రామంలో నూతన, అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గుట్కా, మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థలకు దూరంగా ఉండాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సాహయ, సహకారాలు అందిస్తామన్నారు. సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

వెంకటాపురం(ఎం): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. శనివారం కార్మికులతో కలిసి ఆయన ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు రావడం లేదన్నారు. కార్మికులకు జీఓ నంబర్ 8 ప్రకారం రూ.3 వేల గౌరవ వేతనం అందిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పటివరకు అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య, నాయకులు కొక్కుల రాజేందర్, జనగాం శోభ, పోచమ్మ, ప్రమీల, రమ, రాజేశ్వరి, లక్ష్మి, సరిత, పద్మ, తిరుమల, రజిత, నర్సమ్మ, స్వరూప, శారద తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్‌రావు

వెంకటాపురం(కె): ఇంటి స్థలం లేని నిరుపేదలకు ప్రభుత్వం తక్షణమే స్థలాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, భద్రాచలం నియోజక వర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పేదలకు, గిరిజనులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ బస్సు జాత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్ ఎదుట పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఇల్లు నిర్మించుకోవటానికి కేంద్రం రూ.10 లక్షలు, రాష్ట్రం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తునికాకు బోనస్ వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీరెడ్డి సాంబశివ, కుమ్మరి శ్రీను, వంకా రాములు, జ్ఞానం వాసు, దావూద్, రత్నం రాజేందర్, కట్ల నర్సింహాచారి, రాంబాబు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

20న రీడింగ్ రూంల ప్రారంభం

టేకుమట్ల: ఈ నెల 20 వ తేదీన విద్యాదినోత్సవం సందర్భంగా మండల కేంద్రంతో పాటు, మండలంలోని ఎంపేడులో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రీడింగ్ రూంలను ప్రారంభించనున్నట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ బుర్ర రమేష్ తెలిపారు. శనివారం ఎంపేడులో ఏర్పాటు చేసిన రీడింగ్ రూంలను పరిశీలించారు.

కేసులను త్వరగా పరిష్కరించాలి



భూపాలపల్లి అర్బన్: కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి తుకారాంజీ



భూపాలపల్లి అర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి

- హైకోర్టు జడ్జి తుకారాంజీ
- జిల్లా కేంద్రంలో ఫోక్సో కోర్టు ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని తెలంగాణ హైకోర్టు జడ్జి (అడ్మినిస్ట్రేషన్) తుకారాంజీ తెలిపారు. జిల్లాకేంద్రంలో ఏర్పాటుచేసిన ఫాస్ట్రాగ్, ఫోక్సో కోర్టును శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లాకేంద్రంలో ఒక్కొక్కటిగా అన్ని కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే సొంత భవనం నిర్మించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. స్థల సేకరణ పూర్తయిందన్నారు. కోర్టులో కావాల్సిన సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. ఫోక్సో కోర్టుకు వచ్చేటువంటి కేసులను ఎప్పటికిప్పుడు విచారణ చేపట్టాలని సూచించారు. బాధితులకు కోర్టులపై నమ్మకం కలిగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు, కలెక్టర్ భవేష్‌మిశ్రా, జూనియన్ జడ్జిలు జయరామిరెడ్డి, రాంచందర్‌రావు, ములుగు, మహబూబాబాద్ కోర్టుల జడ్జిలు శివజ్యోతి, చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, ఆనందరావు, సీనియర్ న్యాయవాదులు శ్రీనివాసచారి, మధు, రవీందర్, రమేష్ పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో పూజలు



కాళేశ్వరం: హైకోర్టు జడ్జిని సన్మానిస్తున్న ధర్మకర్త సమ్మయ్య

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని తుకారాం జీ దర్శించుకున్నారు. శనివారం ఆయన ఆలయానికి రాగా రాజగోపురం వద్ద ఆలయ అర్చకులు, అధికారులు మంగళవాయిద్యాలతో వేదపండితులు మంత్రోచ్ఛరణల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా గణపతి పూజ నిర్వహించి స్వామివారి గర్భగుడిలో అభిషేక పూజలు చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో జడ్జిని దేవస్థానం ధర్మకర్త అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి శాలువాతో సన్మానించారు. అర్చకులు తీర్థప్రసాదం అందజేశారు. ఆయన వెంట భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల జడ్జిలు, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, మహదేవపూర్ సీఐ కిరణ్, ఎస్సై లక్ష్మణ్‌రావు ఉన్నారు.

నలుగురిపై కేసు నమోదు



మాంసాన్ని, నిందితులను అరెస్టు చూపిస్తున్న ఎఫ్ఆర్ఓ నరేందర్

ఏటూరునాగారం: మండల పరిధిలోని నందమూరినగర్ ప్రాంతంలో దుప్పిమాంసాన్ని స్వాధీనం చేసుకుని, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు నార్త్ రేంజ్ అధికారి నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం వివరాలను వెల్లడించారు. మండల కేంద్రంలోని నందమూరినగర్ ప్రాంతంలో దుప్పి మాంసాన్ని విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి వెళ్లి దాడులు చేశామని తెలిపారు. నందమూరినగర్‌కు చెందిన తుమ్మ మహేష్, ఆకుల శంకర్, మార జగన్‌లు దుప్పిని చిన్నబోయినపల్లి అటవీ ప్రాంతంలో కరెంటు ఉచ్చులను పెట్టి శక్రవారం సాయంత్రం దానిని హతమార్చారని తెలిపారు. శనివారం ఉదయం నందమూరినగర్ ప్రాంతానికి తీసుకొచ్చి మాంసాన్ని రూ.600 కిలో చొప్పున విక్రయించారని తెలిపారు. మరో వ్యక్తి దుర్గం రాము కొనుగోలు చేయగా అతడిని అదుపులోకి తీసుకొని మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో ఆకుల శంకర్ పరారీలో ఉన్నారని వివరించారు. అటవీశాఖ వన్యప్రాణి చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. మాంసం, తల, కాళ్లు, చర్మం స్వాధీనం చేసుకొని పంచనామా నిర్వహించి పూడ్చివేశామని వివరించారు. ఈ దాడుల్లో డిప్యూటీ రేంజ్ అధికారి ప్రహ్లాద్, ఎఫ్ఎస్ఓలు రవీందర్, రవి, ఎఫ్‌బీఓలు అనూష, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి రాగిజావ అందజేత



రాగిజావ ప్యాకెట్లను చూపిస్తున్న డీఈఓ

ములుగు:మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారానికి మూడు రోజుల పాటు రాగిజావ అందించనున్నట్లు డీఈఓ పాణిని తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో రాగిజావ ప్యాకెట్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తొలివిడతలో జిల్లాలోని 93 పాఠశాలల్లో రాగిజావ పంపిణీ చేయనున్నట్లు వివరించారు. జులై 1వ తేదీ నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తామని తెలిపారు.